లోక్‌సభ స్పీకర్‌గా ఓం బిర్లా

- మూజువాణి ఓటుతో ఎన్నిక
- వరుసగా రెండోసారి బాధ్యతలు
- ప్రధాని, రాహుల్ అభినందనలు
- మా గొంతు వింటారని ఆశిస్తున్నాం
- విపక్ష పార్టీల ఎంపీల ఆశాభావం

న్యూఢిల్లీ, జూన్ 26: 18వ లోక్‌సభ స్పీకర్‌గా అధికార ఎన్డీయే కూటమి బలపర్చిన అభ్యర్థి, బీజేపీ ఎంపీ ఓం బిర్లా బుధవారం ఎన్నికయ్యారు. విపక్ష ఇండియా కూటమి అభ్యర్థి కే సురేశ్‌పై ఆయన విజయం సాధించారు. సభలో చేపట్టిన మూజువాణి ఓటింగ్ అనంతరం ఓం బిర్లా గెలిచినట్టు ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ ప్రకటించారు. దీంతో గత టర్మ్‌లో కూడా స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టిన ఓం బిర్లా వరుసగా రెండోసారి ఆ పదవిని చేపట్టారు. రెండోసారి స్పీకర్ అయిన వాళ్లలో ఓం బిర్లా ఐదో వ్యక్తి. స్పీకర్‌గా ఎన్నికైన తర్వాత ఓం బిర్లాకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతర ఎంపీలు అభినందనలు తెలిపారు. ఆ తర్వాత మోదీ, రాహుల్ వెంట రాగా.. ఓం బిర్లా స్పీకర్ కుర్చీలో ఆసీనులయ్యారు. ఈ సందర్భంగా మోదీతో రాహుల్ కరచాలనం చేశారు. అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ గత టర్మ్‌లో సభ కార్యకలాపాలను నిర్వహించడంలో ఓం బిర్లా సమతుల్యత పాటించారని, చాలా చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకొన్నారని ప్రశంసించారు. పార్లమెంట్ సభ్యుడిగా ఆయన పని కొత్త ఎంపీలకు స్ఫూర్తి అన్నారు. రాహుల్, అఖిలేశ్ యాదవ్ సహా పలువురు విపక్ష ఎంపీలు మాట్లాడుతూ స్పీకర్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. ప్రజల గొంతుకను వినిపించేందుకు అవకాశాలు ఇవ్వాలన్నారు. ఎంపీల సస్పెన్షన్లు మరోసారి జరుగకూడదని పలువురు విపక్ష ఎంపీలు పేర్కొన్నారు. విపక్షం గొంతును అణచివేసి, సభను నడపటం అనేది ఒక అప్రజాస్వామిక ఆలోచన అని రాహుల్ బీజేపీ ప్రభుత్వానికి కౌంటర్ ఇచ్చారు.

ఓం బిర్లాకు అభినందనలు తెలుపుతున్న ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్

ఓంబిర్లా పేరు ప్రతిపాదించిన మోదీ

బుధవారం లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఎన్నిక ప్రక్రియ చేపట్టారు. కొత్త సభాపతిగా ఓంబిర్లా పేరును ప్రతిపాదిస్తూ ప్రధాని మోదీ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సహా పలువురు ఎన్డీయే ఎంపీలు బలపర్చారు. అనంతరం ఇండియా కూటమి తరపున కే సురేశ్ పేరును శివసేన(యూబీటీ) ఎంపీ అరవింద్ సావంత్ ప్రతిపాదించారు. దీన్ని పలువురు విపక్ష సభ్యులు బలపర్చారు. అనంతరం తీర్మానంపై ఓటింగ్ కోసం విపక్షం పట్టుబట్టకపోవడంతో ప్రొటెం స్పీకర్ మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. తర్వాత ఓం బిర్లా గెలిచినట్టు ప్రకటించారు.

అందరి మాట వినడమే ప్రజాస్వామ్య బలం: స్పీకర్

స్పీకర్ కుర్చీపై ఆసీనులైన అనంతరం ఓంబిర్లా మాట్లాడుతూ అధికార, విపక్షాలు కలిసి సభను నడుపుతాయని అన్నారు. ప్రతి ఒక్కరి మాట వినడమే ప్రజాస్వామ్య బలమని పేర్కొన్నారు. సభ ఎలాంటి ఆటంకాలు లేకుండా నడుస్తుందని ఆశిస్తున్నానని పేర్కొన్న ఓంబిర్లా.. విమర్శలు ఉండొచ్చు కానీ, ఆటంకాలు ఏర్పరచడం సభ సంప్రదాయం కాదని పేర్కొన్నారు. సభ్యులందరూ పార్లమెంటరీ సంప్రదాయాలను ఉన్నతంగా పాటించాలని కోరారు. కాగా, లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీని స్పీకర్ ఓంబిర్లా గుర్తించారు. ఈ మేరకు లోక్‌సభ సెక్రటేరియట్ బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది.

ఏకాభిప్రాయం రాకపోవడంతో తప్పని ఎన్నిక

దశాబ్దాలుగా సంప్రదాయంగా వస్తున్న స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవంపై అధికార ఎన్డీయే, విపక్ష ఇండియా కూటముల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో పోటీ అనివార్యమైన విషయం తెలిసిందే. ఎన్డీయే తరపున ఓంబిర్లా మంగళవారం నామినేషన్ వేయగా.. విపక్ష ఇండియా నుంచి కాంగ్రెస్ ఎంపీ కే సురేశ్ పోటీలో నిలబడ్డారు. డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వాలన్న విపక్షాల కండీషన్‌కు అధికార పక్షం అంగీకరించకపోవడంతో దాదాపు గత 50 ఏండ్లలో తొలిసారి, స్వతంత్ర భారతంలో మూడోసారి స్పీకర్ ఎన్నిక జరిగింది.

అద్వానీకి అస్వస్థత

న్యూఢిల్లీ: బీజేపీ సీనియర్ నేత, మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీ (96) బుధవారం అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను కుటుంబ సభ్యులు ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేర్చారు. వయో సంబంధిత అనారోగ్య సమస్యలతోనే ఆయనను దవాఖానలో చేర్చినట్టు ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. మూడు నెలల కిందటే కేంద్ర ప్రభుత్వం ఆయనకు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్నను ప్రదానం చేసింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్వయంగా ఆయన నివాసానికి వెళ్లి పురస్కారాన్ని అందజేశారు.

ఒవైసీపై అనర్హత వేటు వేయాలి

'జై పాలస్తీనా' నినాదంపై రాష్ట్రపతికి న్యాయవాది ఫిర్యాదు

న్యూఢిల్లీ, జూన్ 26: లోక్‌సభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసే సమయంలో 'జై పాలస్తీనా' అని నినాదం చేసిన హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు న్యాయవాది హరిశంకర్ జైన్ ఫిర్యాదు చేశారు. పార్లమెంట్ సభ్యుడిగా ఒవైసీపై అనర్హత వేటు వేయాలని కోరారు. ఉభయ సభలకు చెందిన ఏ ఎంపీ అయినా ఇతర దేశం పట్ల విధేయత, నిబద్ధత చూపితే.. అలాంటి సందర్భంలో అతను/ఆమె పార్లమెంట్ సభ్యులుగా అనర్హులు అవుతారని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 102, 103 ప్రకారం ఒవైసీపై తక్షణం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కాగా, ఎంపీ ఒవైసీ మంగళవారం లోక్‌సభలో ప్రమాణం చేసిన అనంతరం 'జై భీమ్, జై మీమ్, జై తెలంగాణ, జై పాలస్తీనా' అంటూ నినాదం ఇచ్చారు.

నీట్ అక్రమాలపై దర్యాప్తు చేపట్టాలి

కేరళ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం

తిరువనంతపురం, జూన్ 26: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో జరిగిన నీట్, నెట్, ఇతర ప్రవేశ పరీక్షల్లో జరిగిన అక్రమాలపై దర్యాప్తు చేపట్టాలని, బాధిత విద్యార్థులకు తగిన న్యాయం చేయాలని కేరళ అసెంబ్లీ డిమాండ్ చేసింది. అధికార ఎల్డీఎఫ్, కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష యూ డీఎఫ్ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించాయి. పరీక్షల నిర్వహణలో ఎన్‌టీఏ విశ్వసనీయతపై సందేహం వ్యక్తం చేశాయి. ఈ పరీక్షల అక్రమాలకు కారణం కేంద్ర మేనని ఎల్డీఎఫ్ ఎమ్మెల్యే ఎం విజ్జిన్ ఆరోపించారు. కేంద్రం రాజకీయ ప్రయోజనాలకు అనుకూలంగా విద్యా విధానాన్ని మారుస్తున్నదని ఎల్డీఎఫ్ ఆరోపించింది.

కులగణన చేపట్టండి

కేంద్రాన్ని కోరుతూ తమిళనాడు అసెంబ్లీ తీర్మానం

చెన్నై : కులాలవారీ జనాభా లెక్కల సేకరణను త్వరగా ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తమిళనాడు శాసనసభ బుధవారం ఏకగ్రీవంగా ఓ తీర్మానాన్ని ఆమోదించింది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీనికి బీజేపీ సహా పలు పార్టీలు మద్దతిచ్చాయి. అయితే సభలో గందరగోళం సృష్టిస్తున్నందుకు ఏఐఏడీఎంకే సభ్యులను సస్పెండ్ చేయడంతో వారు లేకుండానే ఈ తీర్మానం ఆమోదం పొందింది. స్టాలిన్ మాట్లాడుతూ, సెన్సస్ చట్టం ప్రకారం జనాభా లెక్కలను సేకరించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి, ప్రజల సాంఘిక-ఆర్థిక స్థితిగతుల సమాచారాన్ని సేకరించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందన్నారు.

కాంగ్రెస్ ఓవర్సీస్ చైర్మన్‌గా మళ్లీ పిట్రోడా

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల సమయంలో వివాదాస్పద వ్యాఖ్యలతో కాంగ్రెస్‌ను ఇబ్బంది పెట్టి చివరకు పదవి నుంచి తప్పుకున్న కాంగ్రెస్ నేత శామ్ పిట్రోడా తిరిగి తన పూర్వ పదవిలో నియమితులయ్యారు. పార్టీ ఓవర్సీస్ చైర్మన్‌గా ఆయనను తిరిగి నియమిస్తున్నట్టు కాంగ్రెస్ బుధవారం ప్రకటించింది. పిట్రోడా వారసత్వ పన్ను గురించి, తర్వాత భారతీయుల రంగు, ఆకారం, వేష భాషలను విదేశీయులతో పోలుస్తూ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌కు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. దీంతో ఆయన పదవి నుంచి తప్పుకున్నారంటూ మే 8న కాంగ్రెస్ ప్రకటించింది. ఇప్పుడు ఎన్నికలు ముగిసి అంతా సద్దుమణగడంతో ఆయనను తిరిగి పూర్వ పదవిలోనే నియమిస్తున్నట్టు కాంగ్రెస్ ప్రకటించింది.

సీబీఐని నిలదీసిన కోర్టు!

- మద్యం పాలసీకి సిసోడియానే బాధ్యుడని కేజ్రీవాల్ చెప్పారు..
- సీబీఐ వాదన.. కోర్టు అభ్యంతరం
- ఆయన స్టేట్‌మెంట్‌ను మేం చదివాం.. అలా ఎక్కడా చెప్పలేదని స్పష్టీకరణ
- 3 రోజుల సీబీఐ కస్టడీకి ఢిల్లీ సీఎం

కేజ్రీవాల్‌ను కోర్టుకు తీసుకెళ్తున్న సీబీఐ అధికారులు

న్యూఢిల్లీ, జూన్ 26: మద్యం పాలసీకి సంబంధించి అవినీతి ఆరోపణల కేసులో కేజ్రీవాల్‌ను సీబీఐ బుధవారం అధికారికంగా అరెస్టు చేసింది. అనంతరం ఢిల్లీ రౌస్ ఎవెన్యూ కోర్టులో హాజరు పరిచింది. ఐదు రోజుల కస్టడీకి ఇవ్వాలన్న సీబీఐ అభ్యర్థనపై విచారణ జరిపిన ప్రత్యేక జడ్జి అమితాబ్ రావత్.. కేజ్రీవాల్‌ను మూడు రోజుల కస్టడీకి అప్పగించారు. అయితే వాదనల సందర్భంగా రౌస్ ఎవెన్యూ కోర్టులో ఆసక్తికర పరిణామం చోటుచేసుకొన్నది. నూతన మద్యం పాలసీ కింద లిక్కర్ దుకాణాల ప్రైవేటీకరణకు మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియానే సిఫారసు చేశారని కేజ్రీవాల్ విచారణలో చెప్పారన్న సీబీఐ వాదనపై కోర్టు అభ్యంతరం చెప్పింది. కేజ్రీవాల్ స్టేట్‌మెంట్‌ను తాము చదివామని, ఆయన అలాంటి ప్రకటనేమీ చేయలేదని స్పష్టం చేసింది. ప్రైవేటీకరణ తన ఆలోచన కాదని మాత్రమే కేజ్రీవాల్ చెప్పారని, సీబీఐ తప్పుగా గ్రహించిందని పేర్కొన్నది. కాగా, సీబీఐ ఆరోపణలను కేజ్రీవాల్ కూడా తన వాదనల సందర్భంగా ఖండించారు. సిసోడియాను దోషిగా చెప్పేలా తాను ఎలాంటి స్టేట్‌మెంట్ ఇవ్వలేదని, వాళ్ల లక్ష్యం తమను అప్రతిష్ఠ పాల్జేయడమేనని అన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థ వాస్తవాలను వక్రీకరిస్తుందని అన్నారు. తాను గానీ, సిసోడియా గానీ, తన పార్టీ కానీ ఎలాంటి అవినీతికి పాల్పడలేదని కేజ్రీవాల్ ఈ సందర్భంగా వాదించారు.

కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా మొత్తం వ్యవస్థ: సునీత

తన భర్త జైలు నుంచి బయటకు రాకుండా మొత్తం వ్యవస్థ ప్రయత్నిస్తున్నదని కేజ్రీవాల్ భార్య సునీత ఆరోపించారు. ఇది నియంతృత్వం, ఎమర్జెన్సీతో సమానమని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్‌కు ట్రయల్ కోర్టు బెయిల్ మంజూరు చేసిందని, అయితే దీనిపై ఈడీ వెంటనే హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకొన్నదని అన్నారు. ఆ తర్వాతి రోజునే సీబీఐ ఆయన్ను అరెస్టు చేసిందని, ఈ విధంగా వ్యవస్థ మొత్తం కేజ్రీవాల్ జైలు నుంచి బయటకు రాకుండా పనిచేస్తున్నదని సునీత ఆరోపించారు. 'ఇది చట్టం కాదు. ఇది ఒక నియంతృత్వం, ఇది ఎమర్జెన్సీ' అని ఎక్స్‌లో పోస్టు చేశారు.

రాత్రి వేళ వెలుగుతో మధుమేహం!

సిడ్నీ: రాత్రి వేళ వెలుగును ఎక్కువగా చూడటం వల్ల టైప్ 2 మధుమేహ ముప్పు 67 శాతం పెరుగుతుందని ఆస్ట్రేలియాలోని ఫ్లిండర్స్ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు జరిపిన అధ్యయనంలో వెల్లడైంది. 84,700 మందిపై ఈ అధ్యయనం జరిగింది. ఇందుకోసం 2013 నుంచి 2016 మధ్యకాలంలో ఒక్కొక్కరికి వారం రోజుల పాటు చేతులకు లైట్ సెన్సార్లను ఏర్పాటు చేశారు. తొమ్మిదేండ్ల తర్వాత ఈ డాటాను విశ్లేషించగా ఎక్కువగా రాత్రిపూట వెలుగులో ఉన్న వారిలో మధుమేహ ముప్పు 67 శాతం పెరిగిందని గుర్తించారు. రాత్రి పూట ఎంత ఎక్కువ సేపు వెలుగులో ఉంటే అంత ఎక్కువగా ఈ ముప్పు పెరుగుతున్నట్టు తేల్చారు.

వెలుగు వల్ల మానసిక, శారీరక మార్పులు

రాత్రిపూట ఎక్కువగా వెలుగును చూడటం, వెలుతురులో గడపడం వల్ల మనిషిలో మానసిక, శారీరక మార్పులు వస్తాయని, 24 గంటల చక్రం దెబ్బతింటుందని పరిశోధకులు పేర్కొన్నారు. ఇది గ్లూకోజ్ మెటాబాలిజంలోనూ మార్పులకు కారణమవుతుందని తెలిపారు. తద్వారా శరీరంలో చక్కెర స్థాయిలను క్రమబద్ధీకరించుకునే శక్తి తగ్గిపోతుందని, మధుమేహం మొదలవడానికి దారి తీస్తుందని పరిశోధకుడు అండ్రూ ఫిలిప్స్ తెలిపారు. రాత్రిపూట స్క్రీన్‌లు చూడటం, రోజూ ఒకే సమయానికి నిద్రపోకపోవడం వంటివి మధుమేహ ముప్పును పెంచుతాయని పేర్కొన్నారు.

ఎమర్జెన్సీ.. ఓ చీకటి అధ్యాయం

- సభలో తీర్మానం చదివిన స్పీకర్ ఓం బిర్లా
- ఎమర్జెన్సీ ప్రస్తావనపై కాంగ్రెస్ ఎంపీల నిరసన
- నాటి పరిస్థితులకు కాంగ్రెస్ క్షమాపణలు చెప్పాలి
- కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీల డిమాండ్

న్యూఢిల్లీ, జూన్ 26: లోక్‌సభ స్పీకర్‌గా మరోసారి ఎన్నికైన ఓం బిర్లా కాంగ్రెస్ హయాంలో దేశంలో విధించిన 'ఎమర్జెన్సీ'ని ఖండిస్తూ తీర్మానాన్ని చదవడం సభలో దుమారం రేపింది. ప్రధానిగా ఇందిరా గాంధీ విధించిన అత్యయిక స్థితి రాజ్యాంగంపై దాడి అని, 1975, జూన్ 25వ తేదీ భారతదేశ చరిత్రలో ఒక చీకటి అధ్యాయం అని ఆయన పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతలను కాంగ్రెస్ ప్రభుత్వం జైల్లో వేసిందని, దేశాన్నే ఒక జైలుగా మార్చిందని, మీడియాపై ఆంక్షలు విధించారని, న్యాయ వ్యవస్థ స్వతంత్రను కూడా నియంత్రించారని ఓం బిర్లా పేర్కొన్నారు. 'ప్రజాస్వామ్య విలువలను ప్రోత్సహించే భారత్.. ఇందిరా గాంధీ నియంతృత్వానికి గురైంది. భారత ప్రజాస్వామ్య విలువులను అణచివేశారు. భావ ప్రకటనా స్వేచ్ఛను ఉక్కిరిబిక్కిరి చేశారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ఆనాడు పోరాడిన వాళ్ల నిబద్ధతను అభినందిస్తున్నాం' అని ఓంబిర్లా పేర్కొన్నారు. ఆ రోజుల నాటి బాధితులకు ఈ సభ సంతాపాన్ని తెలియజేస్తుందని ఓంబిర్లా ఈ సందర్భంగా పేర్కొన్నారు.

'ఎమర్జెన్సీ' ప్రస్తావనపై కాంగ్రెస్ సభ్యుల అభ్యంతరం

లోక్‌సభలో స్పీకర్ 'ఎమర్జెన్సీ' అంశాన్ని ప్రస్తావించడంపై కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమర్జెన్సీ ప్రస్తావనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రతిగా 49 ఏండ్ల క్రితం ఎమర్జెన్సీ విధింపు ద్వారా పౌరహక్కులను కాలరాశారని పేర్కొంటూ పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీ , మిత్రపక్షాల ఎంపీలు పార్లమెంట్ కాంప్లెక్స్‌లో నిరసన తెలిపారు. నాటి పరిస్థితులకు కాంగ్రెస్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

కర్ణాటకలో 'సీఎం కుర్చీ' ఆట

- డీకే, సిద్ధరామయ్య వర్గాల మధ్య తీవ్రమైన పోరు
- మరో ముగ్గురిని డిప్యూటీ సీఎంలుగా నియమించాలి
- డీకేకు చెక్ పెట్టేందుకు సిద్ధరామయ్య వర్గం డిమాండ్
- పీసీసీ అధ్యక్ష పదవి వదులుకోవాలని సైతం ఒత్తిడి
- శివకుమార్‌ను సీఎం చేయాలంటున్న ఆయన వర్గం

బెంగళూరు: కర్ణాటకలో మళ్లీ కుర్చీలాట మొదలయ్యింది. లోక్‌సభ ఎన్నికలు ముగిసే వరకు నిశ్శబ్దంగా ఉన్న కాంగ్రెస్ నేతలు ఇప్పుడు కుంపటి రాజేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు చెక్ పెట్టేందుకు సిద్ధరామయ్య వర్గం మరో ముగ్గురిని ఉప ముఖ్యమంత్రులుగా నియమించాలనే డిమాండ్‌ను తెరపైకి తెచ్చింది. మరోవైపు సిద్ధరామయ్య ఇక ముఖ్యమంత్రి కుర్చీ నుంచి దిగిపోయి శివకుమార్‌కు అప్పగించాలని ఆయన వర్గం కొత్త రాగం అందుకున్నది. దీంతో కర్ణాటక కాంగ్రెస్ రెండు వర్గాలుగా చీలిపోయింది. డీకేను నిలవరించేందుకు సిద్ధరామయ్య, సిద్ధరామయ్యకు ఎసరు పెట్టేందుకు డీకే తెరవెనుక ఉండి తమ వర్గీయులతో బాహాటంగా ప్రకటనలు చేయిస్తున్నారనే ప్రచారం జరుగుతున్నది.

మరో ముగ్గురు డిప్యూటీ సీఎంలు

ప్రస్తుతం కర్ణాటకలో డీకే శివకుమార్ మాత్రమే ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఇప్పుడు ఆయనతో పాటు లింగాయత్, ఎస్సీ/ఎస్టీ, మైనారిటీ వర్గాల నుంచి ఒక్కొక్కరి చొప్పున మరో ముగ్గురిని డిప్యూటీ సీఎంలుగా నియమించాలని మంత్రి కేఎన్ రాజన్న డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌లో ఒక్కరికి ఒకే పోస్టు ఇవ్వాలనే పద్ధతి ఉందని, ఈ పద్ధతిని పాటించి డీకే శివకుమార్ తన పీసీసీ అధ్యక్ష పదవిని వదులుకోవాలని సైతం రాజన్న పేర్కొన్నారు. డీకే శివకుమార్‌కు చెక్ పెట్టేందుకు సీఎం సిద్ధరామయ్య వర్గం ఈ రెండు వాదనలను తెరపైకి తెచ్చినట్టు సమాచారం.

డీకేను ముఖ్యమంత్రిని చేయాలి

డీకే శివకుమార్‌కు వ్యతిరేకంగా సిద్ధరామయ్య వర్గం పావులు కదుపుతుండటంతో డీకే వర్గం కూడా అప్రమత్తమైంది. సిద్ధరామయ్య సీఎం పదవిని వదిలి శివకుమార్‌కు అప్పగించాలని చెన్నగిరి ఎమ్మెల్యే బసవరాజు శివగంగ బుధవారం డిమాండ్ చేశారు. సిద్ధరామయ్య గతంలో ఐదేండ్లు, ఇప్పుడు ఏడాదిన్నర సీఎంగా ఉన్నారని, ఇక దిగిపోవాలని పేర్కొన్నారు. మరో ముగ్గురు డిప్యూటీ సీఎంలను నియమించాలనే వాదనను కూడా డీకే వర్గం తప్పుపడుతున్నది. డిప్యూటీ సీఎం పదవి ఖాళీ లేదని మంత్రి చెలువరాయస్వామి.. సిద్ధరామయ్య వర్గానికి కౌంటర్ ఇచ్చారు.

సొంతంగా రోడ్ల బాగు

ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోని కర్ణాటక కాంగ్రెస్ సర్కారు

విసిగిపోయి బెంగళూరులో సొంతంగా రోడ్డు బాగుచేసుకున్న ఉద్యోగులు, ఐటీ నిపుణులు

బెంగళూరు, జూన్ 26: కర్ణాటక రాజధాని బెంగళూరు నగర అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తున్నది. ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలను కల్పించడంలోనూ ఆశ్రద్ధ వహిస్తున్నది. ప్రభుత్వ తీరుతో విసిగిపోతున్న ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సమస్యలను పరిష్కరించుకుంటూ ప్రభుత్వ అసమర్థత పట్ల నిరసన తెలిపారు. నగరంలోని బలగేరే ప్రాంతంలో రోడ్లు గుంతలమయంగా మారాయని, చెత్త ఊడ్చే వారు కూడా లేరని స్థానికులు బెంగళూరు మహానగరపాలక సంస్థ(బీబీఎంపీ)కి అనేక సార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకలేదు. దీంతో విసిగిపోయిన విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు, యువత స్వయంగా రంగంలోకి దిగారు. రోడ్లపై గుంతలు పూడ్చి, శుభ్రం చేశారు. ఇది సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. దీంతో కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్పందించారు. రోడ్ల సమస్యపై వెంటనే చర్యలు తీసుకోవాలని, ఇలాంటివి పునరావృతం కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులను ఆదేశించారు.

రోడ్లు బాగా లేకుంటే టోల్ వసూలు చేయొద్దు

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ: రోడ్లు సరిగా లేకుంటే టోల్ చార్జీలు వసూలు చేయొద్దని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ హైవే సంస్థలకు సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 5 వేల కిలోమీటర్లకు పైగా అమలు చేయనున్న ఉపగ్రహ ఆధారిత టోలింగ్‌పై బుధవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో గడ్కరీ మాట్లాడారు. నాణ్యమైన సేవలు అందించనప్పుడు టోల్ వసూలు చేయకూడదని స్పష్టం చేశారు. మన ప్రయోజనాల కోసం టోల్‌ను ప్రారంభించి వినియోగదారుల నుంచి డబ్బులు వసూలు చేసేందుకు తొందరపడుతున్నామని పేర్కొన్నారు. వినియోగదారులకు నాణ్యమైన రోడ్లను అందించినప్పుడు మాత్రమే రుసుము వసూలు చేయాలని తెలిపారు. బాగా లేని రోడ్లకు కూడా టోల్ వసూలు చేస్తే వ్యతిరేకత తప్పదని గడ్కరీ పేర్కొన్నారు.



నేరస్థుడి మెదడులో బాధితుల జ్ఞాపకాలు ఇంప్లాంట్!

సత్ప్రవర్తన తెచ్చే దిశగా శాస్త్రవేత్తల కొత్త ఆలోచన

వాషింగ్టన్: కొందరు నేరస్థుల్లో జైలు జీవితం గడిపినా మార్పు రాదు. ఇలాంటి వాళ్లలో సత్ప్రవర్తన తీసుకొచ్చే దిశగా శాస్త్రవేత్తలు భవిష్యత్తులో కొత్త విధానాన్ని తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. నేరం తాలూకు జ్ఞాపకాలను నేరస్థుల మెదళ్లలో ఇంప్లాంట్ చేయాలని చూస్తున్నారు. కాకపోతే.. బాధితుడి తరపు అంశాలను ఇందులో జోడించబోతున్నారు. బాధితుడి బాధ, కుటుంబంపై ప్రభావం.. తదితర అంశాలను చేర్చి నేరస్థుడు తను చేసింది ఎంత పెద్ద నేరమో తెలుసుకునేలా చేయటమే దీని ప్రధాన ఉద్దేశం. వర్చువల్ రియాలిటీ లాంటి ఒక పరికరం ద్వారా నేరస్థుడి మెదడులోకి బాధితుడి భావోద్వేగాలను జొప్పించి, విచారం చెందేలా చేయనున్నారు. ఈ విధానాన్ని హషీం అల్-ఘిలీ అనే శాస్త్రవేత్త అభివృద్ధి చేశారు.

బద్ధకిస్తున్న భారతం

- శారీరక శ్రమ చేయని సగం మంది భారతీయులు
- ప్రపంచవ్యాప్తంగా 12వ స్థానంలో మన దేశం
- శారీరకంగా చురుగ్గా లేని వారిలో మహిళలే ఎక్కువ
- 'లాన్సెట్ గ్లోబల్ హెల్త్' అధ్యయనంలో వెల్లడి
- పెరుగుతున్న గుండెజబ్బులు, మధుమేహ ముప్పు



న్యూఢిల్లీ: ఆధునిక జీవనశైలికి అలవాటు పడుతున్న భారతీయులు శారీరక శ్రమకు దూరం అవుతున్నారని, ఫలితంగా జబ్బుల ముప్పును ఎక్కువగా ఎదుర్కొంటున్నారని ఓ అధ్యయనంలో వెల్లడైంది. సగానికి పైగా భారతీయులు ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) మార్గదర్శకాలకు తగ్గట్టుగా శారీరక శ్రమ చేయడం లేదని అధ్యయనం గుర్తించింది. ఇందుకు సంబంధించిన వివరాలు లాన్సెట్ గ్లోబల్ హెల్త్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. దీని ప్రకారం.. పురుషులతో పోల్చితే ఎక్కువ మంది మహిళలు తగినంత శారీరక శ్రమ చేయడం లేదు. డబ్ల్యూహెచ్‌ఓ మార్గదర్శకాలకు తగ్గట్టుగా శారీరక శ్రమ లేని వారిలో భారత్‌కు చెందిన మహిళలు 57 శాతం ఉండగా, పురుషులు 42 శాతం మంది ఉన్నారు. శారీరక శ్రమకు దూరమవుతూ, జబ్బులకు దగ్గరవుతున్న భారతీయుల సంఖ్య ఏటేటా భారీగా పెరుగుతున్నది. 2000లో తగినంత శారీరక శ్రమ లేని భారతీయులు 22.3 శాతం ఉండగా 2022 నాటికి ఇది 49.4 శాతానికి పెరగడం ఆందోళనకరంగా మారింది.

డబ్ల్యూహెచ్‌ఓ మార్గదర్శకాలు ఏంటి ?

ఒక మనిషి ఆరోగ్యంగా ఉండటానికి ఎంత శారీరక శ్రమ అవసరమో డబ్ల్యూహెచ్‌ఓ మార్గదర్శకాలు సూచిస్తున్నాయి. వీటి ప్రకారం.. పెద్దలు వారానికి 150 నుంచి 300 నిమిషాల పాటు సైకిల్ తొక్కడం, డ్యాన్స్ చేయడం, నడక, జాగింగ్, ఈత కొట్టడం వంటి ఏరోబిక్ ఎక్సర్‌సైజ్‌లను మధ్యస్తంగా చేయాలి. లేదా 75 నిమిషాల పాటు తీవ్రత ఎక్కువ ఉండేలా శారీరక శ్రమ చేయాలి. వారానికి 150 నిమిషాల కంటే తక్కువ శారీరక శ్రమ చేసే వారిని లేదా 75 నిమిషాల కంటే తక్కువ తీవ్రమైన శారీరక శ్రమ చేసే వారిని శారీరకంగా చురుగ్గా లేని వారిగా పరిగణిస్తున్నది. ఇలాంటి వారికి గుండె జబ్బులు, టైప్ 2 మధుమేహం, డెమెన్షియా, బ్రెస్ట్, కొలన్ క్యాన్సర్ వంటి జబ్బుల ముప్పు ఎక్కువగా ఉంటుంది.

12వ స్థానంలో భారత్

*మొత్తం 195 దేశాల్లో ఈ అధ్యయనం చేయగా తగినంత శారీరక శ్రమ లేని దేశాల జాబితాలో భారత్ 12వ స్థానంలో ఉంది. ఈ విషయంలో మన పొరుగు దేశాలైన భూ